

శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలక వర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,21,617లు, బంగారం 1.31 గ్రాములు, వెండి 5.49 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ప్రయాణికులకు పెద్దపీట

- 8లో



గుడారిలో కూలిన వంతెన

- 8లో

న్యూస్‌రీల్

కారులో నాగుపాము కలకలం



కారులో కనిపించిన నాగపాము

జయపురం: పట్టణంలోని ఇండాల్ సర్వీసింగ్ కేంద్రానికి వచ్చిన కారులో 6 అడుగుల నాగు పాము కనిపించింది. దీంతో సిబ్బంది భయంతో బయటకు పరుగులు తీశారు. వివరాల్లోకి వెళ్తే... నవరంగపూర్ జిల్లాలోని ఇంద్రావతిగుడకు ఆదిత్య పట్నాయక్ తన కారును సర్వీసింగ్ నిమిత్తం తీసుకు వచ్చారు. ఈ నేపథ్యంలో బోనెట్ ఎత్తి పరిశీలిస్తున్న మెకానిక్‌కు లోపలి నుంచి శబ్దం వినిపించింది. టార్చ్‌లైట్ వేసి పరిశీలించగా, సర్పం కనిపించింది. దీంతో అక్కడున్న వారంతా ఆందోళనకు గురయ్యారు. ఇంతలో కొందరు చాకచక్యంగా పామును బంధించి నక్కిడొంగర పర్వత ప్రాంతంలో విడిచి పెట్టారు. నవరంగపూర్ లోనే కారు ఇంజిన్‌లో పాము చేరి ఉంటుందని సర్వీసింగ్ సెంటర్ యజమాని తదితరులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

వర్ష బాధితులకు ఆవాస్ గృహాలు



బాధిత కుటుంబాలకు టార్పాన్లు అందిస్తున్న అధికారులు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి సమితి కేంద్రం జొడియా వీధిలో గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల ప్రభావంతో ఐదు ఇళ్లు కూలిపోయాయి. ఈ నేపథ్యంలో నిర్వాసిత బాధిత కుటుంబాలకు ఆవాస్ గృహాలను మంజూరు చేస్తున్నట్లు తహసీల్దార్ బిశ్వ భూషిత్ సాహు వెల్లడించారు. తాత్కాలిక పునరావాసం కింది ఆయా కుటుంబాలకు ఇంటి పైకప్పు వేసుకునేందుకు టార్పాన్లను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ బొనొమాలి సాహు, ఏఆర్ఐ ఉమేష్ బిడిక పాల్గొన్నారు.

వాల్తేర్ డీఆర్ఎంతో ఎమ్మెల్యే భేటీ



డీఆర్ఎంను సత్కరిస్తున్న ఎమ్మెల్యే నారాయణరావు

పర్లాకిమిడి: తూర్పుకోస్తా రైల్వే పరిధిలోని వాల్తేర్ డివిజనల్ మేనేజర్ సౌరభ్ ప్రసాద్‌ను పర్లాకిమిడి ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు దుశ్శాలువతో సత్కరించారు. అనంతరం పర్లాకిమిడి రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫాం, స్టేషన్ పునరుద్ధరణ, కార్యాలయ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన డీఆర్ఎం.. సమస్యల పరిష్కారంతో పాటు పర్లాకిమిడి, గుణుపురం స్టేషన్లను త్వరలో పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ఛిత్రి సింహాద్రి, గేదెల శ్రీధరనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ



యూనిఫాం పంపిణీ చేస్తున్న హిమిరిక

రాయగడ: సదరు సమితి పరిధి పెంట గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం, బూట్లు, సాక్సులను శుక్రవారం పంపిణీ చేశారు. జిల్లా బిజు ఛత్ర జనతాదళ్ ఉపాధ్యక్షుడు ఉదయ్‌కుమార్ హిమిరిక, సర్పంచ్ ఎ.విశ్వనాథ, సమితి సభ్యులు జంబాక తదితరులు పాల్గొని, 530మంది విద్యార్థులకు వీటిని అందజేశారు. రాష్ట్రప్రభుత్వం విద్యార్థులకు ఏటా వీటిని ఉచితంగా పంపిణీ చేస్తోందని ప్రధానోపాధ్యయుడు మనోజ్‌కుమార్ గౌడొ తెలిపారు.



యూనిఫాంతో పాఠశాల విద్యార్థులు

చర్చలు సఫలం..

- జగన్నాథునికి బొనొకొ లగ్గి సేవపై తొలగిన ప్రతిష్టంభన
- దత్త మహాపాత్రో సేవాయత్, అధికార వర్గం మధ్య చర్చలు
- బుధవారాల్లో శ్రీముఖ అలంకరణకు అంగీకారం
- వచ్చే ఏడాది రత్న భండార్ తనిఖీ చేసేందుకు అనుమతి



పూరీ గజపతి మహారాజా దివ్యసింగ్ దేవ్ అధ్యక్షతన సమావేశమైన ఆలయ పాలక మండలి



శ్రీముఖ అలంకరణలో దేవతామూర్తులు

భువనేశ్వర్: శ్రీమందిరం రత్న వేదికపై కొలువుదీరిన దేవతామూర్తుల బొనొకొ లగ్గి సేవ నిర్వహణపై ప్రతిష్టంభన తొలగింది. దాదాపు నెల రోజులుగా ఈ వివాదం కొనసాగుతున్న విషయం తెలిసిందే. కస్తూరి, హరితల్, కర్పూరం, కేశర్, తెలుపు, నలుపు శంఖపు పొడి శ్రీముఖ అలంకరణలో వినియోగిస్తారు. ఈ అలంకరణకు దాదాపు 4గంటల సమయం పడుతుంది. శ్రీముఖ అలంకరణ గోప్య సేవ. దీంతో ఈ వ్యవధిలో సాధారణ భక్తుల ప్రవేశం నివారించి, దర్శనం తాత్కాలికంగా నిలిపి వేస్తారు. అయితే వార్షిక రథయాత్ర తర్వాత మూల విరాట్‌లు గర్భగుడిలోకి తిరిగి వచ్చిన నుంచి బొనొకొ లగ్గి సేవా జరగడం లేదు. ఈ పరిస్థితి నీలాద్రి విజే పురస్కరించుకుని జూన్ 1నుంచి నెలకొని ఉంది. గురువారం నిర్వహించాలని దత్త మహాపాత్రో సేవాయత్‌లు.. బుధవారమే జరపాలని అధికార వర్గం పట్టుబట్టడంతో ఈ పరిస్థితి తాండవించింది. ఈ నేపథ్యంలో చర్చోపచర్చలు అనంతరం జగన్నాథ ఆలయంలో మూల విరాట్‌ల బొనొకొ లగ్గి(శ్రీ ముఖ అలంకరణ) ఆచారం వచ్చే వారం నుంచి తిరిగి పునః ప్రారంభించనున్నారు. ప్రతి నెలా రెండు సార్లు బుధవారం ఈ క్రతువును నిర్వహించాలని ఆలయ నిర్వాహక కమిటీ శుక్రవారం నిర్ణయించింది. బుధవారం ఇతర ఆచారాలు ఉంటే మర్నాడు(గురువారం) నిర్వహించవచ్చని ఉన్నతస్థాయి వర్గం నిర్ణయించిందని పూరీ జిల్లా కలెక్టర్ సమర్థ్ వర్మ వెల్లడించారు. శ్రీముఖ అలంకరణ సేవ వాయిదా వేసే నిర్ణయాన్ని ఇకపై జగన్నాథ ఆలయ అడ్మినిస్ట్రేషన్(ఎస్‌జేటీఏ) తీసుకుంటుందని స్పష్టం చేశారు.

4 ద్వారాలు తెరవడంపై..

జగన్నాథ ఆలయం నలువైపులా ఉన్న 4 ప్రవేశ ద్వారాలు ఇప్పట్లో తెరిచేది లేదని కలెక్టర్ తెలిపారు. 4 ద్వారాలు తెరిచేందుకు అనుకూలమైన పరిస్థితులు లేవన్నారు. హెరిటేజ్ కారిడార్ ప్రాజెక్ట్ పనులు కొనసాగుతున్నందన దర్శనం కోసం బారులు తీరే భక్తులు, యాత్రికుల రద్దీ నియంత్రణ, నిర్వహణకు తగినంత స్థలం లేకపోవడంతో ఈ నిర్ణయం అనివార్యమైనట్లు పేర్కొన్నారు. ఈ పనులు పూర్తయిన తర్వాతే ఆలయ ఉత్తర, దక్షిణ ద్వారాలను తిరిగి తెరుస్తామని స్పష్టం చేశారు. అప్పటి వరకు భక్తులందరినీ ఆలయ తూర్పుద్వారం మీదుగా ప్రవేశానికి అనుమతిస్తామన్నారు. స్థానికులు ప్రస్తుత విధానం ప్రకారం తూర్పు, పడమర వైపు ద్వారాల నుంచి మందిరంలోకి ప్రవేశించవచ్చని వివరించారు. దర్శనం తర్వాత ఉత్తర ద్వారం నుంచి నిష్క్రమిస్తారని స్పష్టత ఇచ్చారు.

సాంకేతిక కమిటీ..

బాహ్య రత్న భండార్ పరిస్థితిని అంచనా వేయడానికి ప్రత్యేక సాంకేతిక కమిటీ ఏర్పాటు చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ కమిటీలో ఆలయ పాలకమండలి సభ్యులు, సేవాయత్‌లు, ఆధునిక శాస్త్రీయ పద్ధతుల పట్ల అవగాహన కలిగిన భారత పురావస్తు శాఖ ఏఎస్ఐ ప్రతినిధులను సభ్యులుగా నియమించాలని సమావేశం తీర్మానించింది. లోపలి రత్న భండార్ తెరవడం, మరమ్మతు చేసే సమగ్ర కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు సుప్రీంకోర్టు లేదా హైకోర్టు రిటైర్డ్ జడ్జితో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని మేనేజింగ్ కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి అధికారిక అభ్యర్థనను పంపాలని నిర్ణయించిందని కలెక్టర్ తెలిపారు. వివిధ వర్గాల నుంచి జగన్నాథ ఆలయ రత్న భండారాన్ని తెరవాలని పెరిగిన ఒత్తిడి నేపథ్యంలో ఆలయ మేనేజింగ్ కమిటీ నిర్ణయం ప్రాముఖ్యతను సంతరించుకుంది. ప్రతిపక్ష భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్‌తో పాటు, అనేక సామాజిక, సాంస్కృతిక సంస్థలు జగన్నాథుని రత్న భండార్ తెరిచి సొత్తు పూర్తి జాబితా బహిర్గతం చేసే దిశలో చర్యలు చేపట్టాలని దీర్ఘకాలంగా ఒత్తిడి చేస్తున్న విషయం తెలిసిందే.



పూరీ జగన్నాథుని ఆలయం

రత్న భండార్ తనిఖీ చేసేందుకు..

వచ్చే ఏడాది రథయాత్ర సందర్భంగా పూరీ జగన్నాథ స్వామివారి రత్న భండారాన్ని తెరవాలని ఆలయ పాలకమండలి శుక్రవారం సిఫార్సు చేసింది. పూరీ గజపతి మహారాజా దివ్య సింగ్ దేవ్ అధ్యక్షతన జరిగిన పాలకమండలి సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. వచ్చే ఏడాది(2024) రథయాత్ర సందర్భంగా రత్న భండారాన్ని తెరిచి, మరమ్మతులు చేసేందుకు భారత పురావస్తు శాఖ(ఏఎస్ఐ)కు అనుమతించాలని రాష్ట్ర ప్రభుత్వానికి అభ్యర్థించాలని ఈ సమావేశంలో నిర్ణయించడం కీలకమైన చర్యగా భావిస్తున్నారు. మేనేజింగ్ కమిటీ సమావేశం అనంతరం పూరీ కలెక్టర్ సమర్థ వర్మ విలేకర్లతో మాట్లాడుతూ జగన్నాథుని రత్న భండార్ సర్వేకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ఆలయ పాలకవర్గం(ఎస్‌జేటీఏ)కి ఏఎస్ఐ లేఖ రాయడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రత్న భండార్‌ను పరిశీలించాలని ఎస్‌జేటీఏ చీఫ్ అడ్మినిస్ట్రేటర్‌కు ఏఎస్ఐ లేఖ రాసింది. గుండిచా ఆలయానికి దేవతలు 9రోజుల విహార యాత్రకు బయలుదేరిన నిడివిలో దీనిని తనిఖీ చేసేదుకు అనుమతించాలని అభ్యర్థించినట్లు వివరించారు. పాలకమండలి వివరణాత్మక చర్చ తర్వాత ఈ మేరకు నిర్ణయించారు.

1.5 క్వింటాళ్ల బంగారం..

జగన్నాథుని రత్న భండార్ చివరిసారిగా 1978లో తెరిచారు. భండార్‌లో సొత్తు లెక్కింపు, పరిశీలన క్షుణ్ణంగా నిర్వహించారు. తిరిగి 2018 ఏప్రిల్‌లో తెరిచేందుకు చేసిన ప్రయత్నం బెడిసి కొట్టింది. ఏఎస్ఐ సాంకేతిక నిపుణులతో సహా 16మంది సభ్యుల బృందం బాహ్య భండార్ మాత్రమే పరిశీలించింది. తాళం చెవి కనిపించక పోవడంతో పరిశీలన సాధ్యం కాలేదు. పైపైన పరిశీలించి చేతులు దులిపేసుకోవాల్సి వచ్చింది. ఈ పరిశీలనలో రత్న భండార్ లోపలి పరిస్థితి బలహీనంగా ఉన్నట్లు నివేదిక దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో జగన్నాథుని రత్న భండార్ తెరిచే విషయమై రాష్ట్ర హైకోర్టులో వ్యాజ్యం దాఖలైంది. ఈ వ్యాజ్యం విచారణ పురస్కరించుకుని ఎస్‌జేటీఏ ఒడిశా హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. శ్రీమందిరం రత్న భండారం 1978లో తెరిచి పూర్తి జాబితా రూపిందించినట్లు ఈ అఫిడవిట్‌లో నివేదించారు. ఖజానాలో దాదాపు 1.5 క్వింటాళ్లకు పైగా బంగారం, 184కిలోల వెండి ఉన్నట్లు అంచనా వేశారు. రత్న భండార్ లోపలి గదిలో 50.6 కిలోల బంగారు ఆభరణాలు, 134.5 కిలోల వెండి ఆభరణాలు ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అదేవిధంగా బాహ్య రత్న భండార్‌లో సుమారు 95.32 కిలోల బంగారు ఆభరణాలు, 19.48 కిలోల వెండి ఆభరణాలు ఉన్నట్లు తెలిపారు. బాహ్య రత్న భండార్‌లో భద్రపరిచిన ఆభరణాలను వివిధ పండుగలలో దేవతలకు ఉపయోగిస్తారు. సాధారణంగా దేవతలకు వివిధ పూజలు చేసేటప్పుడు సుమారు 3 కిలోల బంగారం, 30 కిలోల వెండి ఆభరణాలను అలంకరిస్తారు.

విజయవంతం చేయాలి: మంత్రి సరక

- ఈనెల 9న ఆదివాసీ ఉత్సవాలపై ప్రచార రథం ప్రారంభం



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సరక

రాయగడ: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం పురస్కరించుకుని ఈనెల 9న రాయగడ గోవిందచంద్ర దేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో జరగనున్న కార్యక్రమానికి సంబంధించి ప్రచార రథం శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమశాఖ మంత్రి జగన్నాథ సరక, ఎస్‌డీసీ చైర్‌పర్సన్ అనసూయ మాఝి, జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షుడు గంగాధర పువ్వల, సమితి వైస్ చైర్మన్ హరప్రసాద్ హెప్రుక, ఆదివాసీ మహాసంఘం జిల్లా అధ్యక్షుడు అప్పలస్వామి కద్రక తదితర ఆదివాసీ నాయకులు హాజరై, ముందుగా మజ్జిగౌరి మందిరంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఈ రథం పర్యటించి, ఆదివాసీ దినోత్సవ సభకు తరలి రావాల్సిందిగా ప్రజలను ఆహ్వానించనుందని తెలిపారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకొని. ఆదివాసీల భాష, సంస్కృతి, ఐక్యతను చాటే విధంగా సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు. అలాగే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ఆదివాసీలు హాజరు కానున్న నేపథ్యంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

దాడులు ముమ్మరం చేయండి

- ఎక్సైజ్‌శాఖ కమిషనర్ నర్సింగ బొలొ



సమీక్షలో మాట్లాడుతున్న నర్సింగ బొలొ

బరంపురం: దక్షిణ ఒడిశాలో గత కొద్ది రోజులుగా సాగుతున్న గంజాయి, నల్లమందు, బ్రౌన్ సుగర్, సారా వంటి మత్తు పదార్థాల తయారీ, విక్రయాలపై దాడులు ముమ్మరం చేయాలని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ కమిషనర్ నరసింగా బొలొ ఆదేశించారు. బరంపురం సర్క్యూ హౌస్‌లో దక్షిణ ఒడిశా స్థాయి ఎక్సైజ్ విభాగం ఆధ్వర్యంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గంజాం, గజపతి, రాయగడా, కొరాపుట్, మల్కన్‌గిరి, నవరంగపూర్, కొందమాల్ జిల్లాల్లో గత కొద్ది రోజులుగా పత్తు పదార్థాల విక్రయాలు ఎక్కువగా నమోదువుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో అంతా అప్రమత్తంగా ఉండాలని, పోలీసు శాఖతో కలిసి, సంయుక్తంగా దాడులు చేపట్టాలని సూచించారు. వీటి విక్రయాలను పూర్తిగా అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. దీనికి సంబంధించి ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించనున్నామని వెల్లడించారు. సమీక్షలో 9 జిల్లాలకు చెందిన ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

తీరని వేదన..



గర్భిణిని డోలీలో ఆస్పత్రికి తరలిస్తున్న గ్రామస్తులు

మల్కన్‌గిరి: జిల్లాలోని గిరిజనులకు రహదారి అవస్థలు తీరడం లేదు. తాగాజా చిత్రకొండ సమితి రల్లేగుడ పంచాయతీలో ఇదే తరహా ఘటన ఎదురైంది. సుమిత్ర పంగి అనే గర్భిణిని ఆస్పత్రికి తరలించేందకు అంబులెన్స్ రాకపోవడంతో భర్త, గ్రామస్తులు డోలీలో 5కిలోమీటర్లు ఆమెను మోసుకు వెళ్లారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు కోదమ్‌జోల గ్రామానికి చెందిన రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది. ఈ క్రమంలో సుమిత్ర ప్రసవ వేదనకు గురవ్వగా.. భర్త జాన్‌బాయి ఆరోగ్య కేంద్రం వద్ద ఉన్న అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. అయితే గ్రామానికి రోడ్డు లేకపోవడంతో అంతవరకు రాలేమని సిబ్బంది తెలిపారు. దీంతో భర్తతో పాటు గ్రామస్తులు ఆమెను డోలీలో కూర్చొబెట్టి, గాజల్ గ్రామం వరకు మోసుకు వెళ్లారు. అక్కడి నుంచి అంబులెన్స్‌లో జాన్‌బాయి ఆరోగ్య కేంద్రానికి చేర్చారు. సుమిత్ర ఆస్పత్రిలో మగబిడ్డకు జన్మనిచ్చింది. సకాలంలో వైద్యం అందడంతో తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు.

ఆదివాసీ విద్యార్థినికి ఆర్థికసాయం



తారా మల్లిక్‌కు ఆర్థికసాయం అందిస్తున్న డిప్యూటీ కలెక్టర్ బీరేంద్ర దాస్

పర్లాకిమిడి: మోహానా నియోజకవర్గంలోని బోడోఖని గ్రామానికి చెందిన తారా మల్లిక్‌కు అదనపు కలెక్టర్ బీరేంద్రకుమార్ దాస్ ఆర్థికసాయం అందించారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మేధా ఛత్ర ప్రోత్సాహక పథకం నుంచి రూ.50 వేలను అందించారు. ఆర్థికంగా వెనుకబడిన తారా.. ఒకవైపు తండ్రికి పొలంలో సాయపడుతునే, చదువుపై ఆసక్తితో హిల్‌టాప్ కళాశాలలో ప్లస్ త్రీ(డిగ్రీ) చదువుతోంది. భవిష్యత్‌లో పీజీ పూర్తి చేసి, చరిత్ర విభాగంలో అధ్యాపకురాలిగా కావాలని ఆసక్తిని వెల్లడించింది. ఆమెకు పుస్తకాలు, ఇతర సామగ్రి కోసం జిల్లా యంత్రాగం ఈ ఆర్థిక సాయాన్ని అందించి, ప్రోత్సహించారు. కార్యక్రమంలో జిల్లా సామాజిక సంక్షేమశాఖ అధికారి మమతారాణి పరిడా, కార్యాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

పాము కాటుతో మహిళ మృతి



ఆస్పత్రిలో బుతికి హంతాల్ మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి పర్శుగూడ గ్రామంలో బుతుకి హంతాల్(50) అనే మహిళకు పాము కాటుకు గురై, మృతిచెందింది. గురువారం రాత్రి భోజనం నిద్రించిన ఆమెను.. అర్ధరాత్రి సమయంలో కాలికి ఏదో కరిచినట్లు అనిపించడంతో వెంటనే కేకలు వేసింది. ఇంట్లోని వారు లేచి చూసేసరికి విష సర్పం కనిపించింది. దీంతో వెంటనే కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మల్కన్‌గిరి జిల్లా కేంద్రాస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందింది. ఘటనపై కలిమెల పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా నిర్వహిద్దాం



సమీక్షలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ప్రధాన్



సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

జయపురం: దేశ స్వాతంత్య్ర దినోత్సవాలను ఘనంగా నిర్వహిద్దామని జయపురం సబ్ కలెక్టర్ దేవధర ప్రధాన్ పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో జరిగిన సబ్ డివిజన్ స్థాయి సన్నాహక సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దసరా పొడియా మైదానంలో వేడుకలు జరపాలని సూచించారు. ఇందులో భాగంగా విద్యార్థుల మధ్య వక్తృత్వ, వ్యాసరచన, దేశభక్తి గీతాలాపన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించాలని తెలిపారు. ఇద్దరు ఉత్తమ పోలీసులు, ఒడిశా సివిల్ సర్వీస్ పరీక్షలో జయపురం నుంచి ఉత్తీర్ణులైన వారిని, సైకిల్‌పై భారత యాత్ర చేపట్టిన ఘాశీ పండాను ఘనంగా సన్మానించాలన్నారు. దీనికి సంబంధించి ఏర్పాట్లు ఘనంగా చేపట్టాలని వివిధ శాఖల అధికారులకు మార్గనిర్దేశం చేశారు. సమీక్షలో సబ్ డివిజనల్ సమాచార, పౌర సంబంధాల అధికారి యశోద గదబ, పట్టణ పోలీసు అధికారి సంబిత్ బెహరా, సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి, బ్లాక్ ఎడ్యుకేషన్ అధికారి చందనకుమార్ నాయక్, ఎన్‌సీసీ అధికారి డాక్టర్ లక్ష్మణ పాత్రొ, సబ్ డివిజన్ క్రీడా కార్యదర్శి రబి నాయక్, ఉపాధ్యాయులు లక్ష్మీకాంత మిశ్రా, యజ్ఞేశ్వర పండా, నిరంజన్ పాణిగ్రాహి, నీటి సరఫరా, అగ్నిమాపక శాఖల అధికారులు, హెచ్‌ఎంలు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధిపై బీఎస్ఎఫ్ చైతన్య శిబిరం



అవగహన కల్పిస్తున్న కమాండెంట్ రాజ్‌పాల్ సింగ్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఎస్ఎఫ్ అధికారులు

మల్కన్‌గిరి: జిల్లాలోని పొడియా సమితి నీలిగూడ గ్రామంలో బీఎస్ఎఫ్ 232 బెటాలియన్ ఆధ్వర్యంలో శుక్రవారం నైపుణ్య శిబిరం నిర్వహించారు. కమాండెంట్ రాజ్‌పాల్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరై, దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన యువతీ, యువకులకు ఉపాధి కల్పించడం, నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. అలాగే 10వ తరగతి పూర్తి చేసిన వారికి భారత సైన్యంలో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఈ మేరకు ప్రతిభ కలిగిన గిరిజన యువతను గుర్తించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నీలిగూడ సర్పంచ్ దేవి మాధిర, పొడియా సమితి అధ్యక్షరాలు యమునా ముషాకి, ఇతర పంచాయతీలకు చెందిన సర్పంచ్‌లు, బీఎస్ఎఫ్ జవాన్లు, యువకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుడారిలో కూలిన వంతెన

- 10 గ్రామాలకు నిలిచిన రాకపోకలు



వంతెనను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గొమాంగో

రాయగడ: జిల్లాలోని గుడారి సమీపంలో ఉన్న సరిగుడ వంతెన గత 3రోజులుగా కురుస్తున్న వర్షాలకు కుప్ప కూలిపోయింది. దీంతో 10గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గురువారం సాయంత్రం ఉన్నఫలంగా వంతెన కూలిపోవడంతో విషయం తెలుసుకున్న గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గమాంగొ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గుడారి, పద్మపూర్, రాయిబిజి పంచాయతీల పరిధిలో గ్రామాల ప్రజలు ఈ వంతెనపై నుంచే ప్రయాణిస్తుంటారు. దీంతో త్వరితగతిన వంతెన నిర్మాణం పనులు చేపట్టి, రాకపోకలు పునరుద్ధరించే విధంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు.

నేడు మత్స్యకారులకు అవగాహన సదస్సు

పార్వతీపురం: జిల్లా కేంద్రంలోని ఆర్‌సీఎం పాఠశాల సమావేశ మందిరంలో మత్స్య సహకార సంఘాలకు అవగాహన సదస్సును శనివారం నిర్వహిస్తున్నట్లు జిల్లా మత్స్య శాఖాధికారి వి.తిరుపతయ్య శుక్రవారం తెలిపారు. పీఎంఎస్‌వై స్కీంలో చేప పిల్లలను నిల్వచేసేందుకు ఉన్న మార్గదర్శకాల గురించి చర్చించేందుకు మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, ఇతర కార్యవర్గ సభ్యులు సదస్సులో పాల్గొంటారన్నారు. ఈ సమావేశానికి మత్స్యకారులు హాజరుకావాలని కోరారు.

పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జాతీయస్థాయిలో ఉత్తమ క్రీడాప్రతిభ కనబరిచిన క్రీడాకారులు, శిక్షకులు, గురువులు, వ్యాయామ ఉపాధ్యాయులకు పురస్కారాలు ప్రదానం చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సీహెచ్ వేణుగోపాలరావులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది లాగానే ఈ ఏడాది జాతీయ క్రీడాదినోత్సవాన్ని నిర్వహించేందుకు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా పురస్కారాలు ప్రదానం చేసేందుకు అర్హత, ఆసక్తి గల వారు ఈనెల 13వ తేదీలోగా తమ దరఖాస్తును విజయనగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న హోటల్ జీఎస్‌ఆర్‌లో అందజేయాలని సూచించారు.

యాచకురాలికి శాస్త్రోక్తంగా అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

పార్వతీపురం: పట్టణంలోని 22వ వార్డు గాంధీ సత్రం దగ్గర కొన్నేళ్లుగా యాచకవృత్తి చేసుకుంటూ నివాసం ఉంటున్న వృద్ధురాలు అనారోగ్యం కారణంగా శుక్రవారం మృతిచెందింది. ఈ మేరకు 22వ వార్డు కౌన్సిలర్ ఆకుల శ్రీనివాసరావు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కమిటీ సభ్యులు బోటు రామకృష్ణ, కె.శేఖర్, కె.సంతోష్ తదితరులు బెలగాం శివారు శ్మశాన వాటికలో అంత్యక్రియలను శాస్త్రోక్తంగా నిర్వహించి మానవత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, పోలీసులు తమ వంతు సహకారం అందించారు.

14న ఉచిత శిక్షణకు ఇంటర్వ్యూలు

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ నైరెడ్‌లో ఉచితంగా అందజేసే స్వయం ఉపాధి శిక్షణకు ఈ నెల 14వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని డైరెక్టర్ కె.శశిధర్ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. నాబార్డు సహకారంతో అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్స్‌లో 50 రోజుల పాటు ఈ శిక్షణ ఇవ్వనున్నామని, దీనికి పదో తరగతి, ఐటీఐ చదివిన శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం జిల్లాల్లోని 19 నుంచి 35 ఏళ్ల యువకులు అర్హులన్నారు. ఈ నెల 18వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 6304626372, 9989057455ను సంప్రదించాలని కోరారు.

అమృత్‌భారత్‌లో జిల్లాకు గౌరవం

విజయనగరం టౌన్: అమృత్ భారత్ పథకం జిల్లాను వరించింది. ఈ పథకం ద్వారా ఎంపిక చేసిన రైల్వేస్టేషన్‌లు పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతాయి. అమృత్‌భారత్ స్టేషన్‌గా విజయనగరం ఎంపికైనట్లు, ఈ నెల 6న రైల్వే స్టేషన్ ఆవరణలో అభివృద్ధి పనులకు నిర్వహించే శంకుస్థాపన కార్యక్రమాన్ని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభిస్తారని డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ తెలిపారు.

ప్రయాణికులకు పెద్దపీట

- అమృత్ భారత్ స్టేషన్ పథకంతో అధునాతన సౌకర్యాలు
- ఖుర్దారోడ్ డివిజన్‌లో 23 రైల్వేస్టేషన్ల పునరాభివృద్ధి
- వెల్లడించిన డీఆర్‌ఎం హెచ్‌ఎస్ బజ్వా

భువనేశ్వర్:

భారత ప్రభుత్వం ప్రారంభించిన అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద దేశవ్యాప్తంగా వివిధ రైల్వేస్టేషన్ల పునరాభివృద్ధి పనులు ప్రారంభించనున్నారు. జాతీయ స్థాయిలో ఈ ప్రాజెక్టు కార్యాచరణకు ఇటీవల ఆధునికీకరణ చెందిన తూర్పుకోస్తా రైల్వే ఖుర్దారోడ్ రైల్వే స్టేషన్ ఆదర్శంగా నిలవడం విశేషం. ఈ స్టేషన్ నమూనాలో దేశవ్యాప్తంగా రైల్వే స్టేషన్లను ఆధునికీకరించేందుకు కేంద్రం నిర్ణయించింది. ఇందులో భాగంగా మౌలిక సదుపాయాలను ఆధునీకరించడం, మెరుగుపరచడం ద్వారా ప్రయాణికులకు ప్రపంచ స్థాయి సౌకర్యాలు, సేవలను అందించడం ఈ పథకం లక్ష్యమని తూర్పుకోస్తా రైల్వే ఖుర్దారోడ్ డీఆర్‌ఎం హెచ్‌ఎస్ బజ్వా తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆయన శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈనెల 6న వర్చువల్ మాధ్యమంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ దేశవ్యాప్తంగా ఈ ప్రాజెక్టు కింద రైల్వేస్టేషన్ల పునరాభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ పథకం తొలి విడత కింద 1,309 రైల్వేస్టేషన్ల అప్‌గ్రేడేషన్, ఆధునీకరణ పనులకు శ్రీకారం చుట్టనున్నారు. సమావేశంలో ఏడీఆర్‌ఎంలు కల్యాణ్ పట్నాయక్, శుభ్రజ్యోతి మండల్ పాల్గొన్నారు.

తొలి దశలో..

ఖుర్దా రోడ్ డివిజన్‌లోని మొత్తం 23 రైల్వేస్టేషన్లు అమృత్ భారత్ పథకం కింద పునరాభివృద్ధికి ఎంపిక చేశారు. మొదటి దశలో 11 స్టేషన్లను అభివృద్ధి చేయనున్నారు. ఇందులో సాక్షి గోపాల్, మంచేశ్వర్, డెంఖనాల్, ఛత్రపూర్, అంగూల్, పలాస, మెరమండలి, బలుగాంవ్, లింగరాజ్ టెంపుల్ రోడ్, తాల్చేర్ రోడ్, ఖుర్దా రోడ్(ద్వితీయ ప్రవేశం) చోటు చేసుకున్నాయి. కొత్త స్టేషన్ భవన సముదాయం, స్టేషన్ ప్రవేశద్వారం, ప్రవేశ వరండాలు, విశ్రాంతి ప్రాంగణం, సర్క్యులేటింగ్ ఏరియా తదితర సౌకర్యాలు అధునాతన శైలిలో ఆధునికీకరిస్తారు. లిఫ్ట్, ప్లాట్‌ఫాం షెల్టర్లు, ఆధునిక ఫర్నిచర్‌తో మెరుగైన వెయిటింగ్ రూంలు, ఆధునిక సౌకర్యాలతో కూడిన ప్రీమియం టాయిలెట్ సౌకర్యం ఈ ప్రాజెక్టు కింద అందుబాటులోకి తెస్తారు. ఈ స్టేషన్లు ఆధునిక భారతదేశం ప్రతిష్ఠకు అద్దం పడతాయని డీఆర్‌ఎం తెలిపారు. స్టేషన్లలో వాహనాల రాకపోకలు, 12 మీటర్ల వెడల్పుతో సెంట్రల్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ప్రత్యేకంగా పార్కింగ్ స్థలం ఉంటుందని పేర్కొన్నారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ పనులు నిర్ధారిత కాల పరిమితిలో పూర్తి చేయనున్నట్లు ఖుర్దారోడ్ డివిజన్ సీనియర్ ఇంజినీర్(సమన్వయం) రవిప్రకాష్ యాదవ్ తెలిపారు. ఈ ప్రాజెక్టు పనులు 8 నెలల నుంచి 10 నెలల వ్యవధిలో పూర్తి చేసేందుకు కాల పరిమితి ఖరారైనట్లు వివరించారు.



సాక్షి గోపాల్ రైల్వేస్టేషన్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఖుర్దారోడ్ డీఆర్‌ఎం బజ్వా

4 ప్రపంచశ్రేణి స్టేషన్లు..

అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద తూర్పుకోస్తా రైల్వే ఖుర్దారోడ్ మండలంలో 4 స్టేషన్ల ప్రపంచశ్రేణి వర్గం కింద ఎంపికయ్యాయి. వీటిలో పూరీ, భువనేశ్వర్, కటక్, భువనేశ్వర్ న్యూ రైల్వేస్టేషన్లు ఉన్నట్లు ఖుర్దారోడ్ సీనియర్ వాణిజ్య విభాగం అధికారి(ఎస్‌డీసీఎం) అమితేష్ ఆనంద్ తెలిపారు. భువనేశ్వర్ న్యూ రైల్వేస్టేషన్ మినహా మిగిలిన స్టేషన్ల వ్యయ ప్రణాళిక ఖరారైనట్లు వెల్లడించారు. వీటితో మరో 4 రైల్వేస్టేషన్లు భారీ విస్తరణ వర్గం కింద ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ జాబితాలో భద్రక్, జాజ్‌పూర్-కెంజొహర్ రోడ్, బరంపురం, ఖుర్దారోడ్ స్టేషన్లు ఉన్నాయి.

ప్రపంచశ్రేణి స్టేషన్	వ్యయ ప్రణాళిక (రూ.కోట్లలో)
పూరీ	125
భువనేశ్వర్	400
కటక్	300

ఒడిశాలో 57 స్టేషన్లు: జీఎం

భువనేశ్వర్: అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద అభివృద్ధి, విస్తరణ, ఆధునికీకరణ పనులు చేపట్టేందుకు తూర్పుకోస్తా రైల్వేజోన్ వ్యాప్తంగా ఒడిశాలో 57 స్టేషన్లను గుర్తించినట్లు ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ తెలిపారు. రాష్ట్రంలో అంగూల్, బాదంపహాడ , బొలంగీర్, బాలాసోర్, బలుగాంవ్, బర్బిల్, బర్‌గడ్ రోడ్, బరిపద, బొరొపాలి, బెల్ పహాడ్, బెటోనాటి, భద్రక్, భవానీపట్న, భువనేశ్వర్, బిమ్లాగఢ్, బరంపురం, బ్రజరాజ్ నగర్, ఛత్రపూర్, కటక్, దామన్‌జోడి, ఢెంకనాల్, గుణుపురం, హరిశంకర్ రోడ్, హీరాకుడ్, జాజ్‌పూర్-కెంజొహర్ రోడ్, జలేశ్వర్, జరోలి, జైపూర్, ఝార్సుగుడ, ఝార్సుగుడ రోడ్, కంటాబంజి, కెందుఝొరా గొడా, కెసింగా, ఖరియార్ రోడ్, ఖుర్దారోడ్, కొరాపుట్, లింగరాజ్ టెంపుల్ రోడ్, మంచేశ్వర్, మెరమండలి, మునిగుడ, భువనేశ్వర్ న్యూ, పారాదీప్, పాన్‌పోష్, పర్లాకిమిడి, పూరీ, రఘునాథ్‌పూర్, రైరఖోల్, రాయ్‌రంగపూర్, రాజగంగ్‌పూర్, రాయగడ, రౌర్కెలా, సాక్షి గోపాల్, సంబల్‌పూర్, సంబల్‌పూర్ సిటీ, తాల్చేర్, తాల్చేర్ రోడ్, టిట్లాగఢ్ జంక్షన్ ఉన్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో..

అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద తూర్పుకోస్తా రైల్వే పరిధి ఆంధ్రప్రదేశ్ ప్రాంతంలో 3 స్టేషన్లు ఎంపికయ్యాయి. వీటిలో 2 స్టేషన్లు వాల్తేరు మండలం మిగిలిన స్టేషన్ ఖుర్దారోడ్ రైల్వే మండలం పరిధిలో ఉన్నట్లు జనరల్ మేనేజర్ తెలిపారు. ఈ స్టేషన్ల అభివృద్ధి, విస్తరణ, ఆధునికీకరణ పనులకు సమగ్రంగా రూ.85.95 కోట్ల నిధులు కేటాయించారు. పలాస(వ్యయ ప్రణాళిక రూ.23.85 కోట్లు) విజయనగరం 35.8 కోట్లు, దువ్వాడ 26.3 కోట్లు మంజూరు చేశారు.

ప్రాజెక్టుల కాల పరిమితి..

స్టేషన్	వ్యవధి	వ్యయ ప్రణాళిక(రూ.కోట్లలో)
తాల్చేర్ రోడ్	2023 నవంబర్	18.85
ఖుర్దా రోడ్	2023 డిసెంబర్	18.01
మంచేశ్వర్	2023 డిసెంబర్	26.85
పలాస	2024 జనవరి	23.85
డెంఖనాల్	2024 ఏప్రిల్	26.11
ఛత్రపూర్	2024 ఏప్రిల్	25.57
అంగూల్	2024 ఏప్రిల్	25.41
మేరమండలి	2024 ఏప్రిల్	21.99
బాలుగావ్	2024 ఏప్రిల్	21.36
సాక్షి గోపాల్	2024 మే	34.84
లింగరాజ్ టెంపుల్ రోడ్	2024 జూన్	19.53

డిమాండ్ల పరిష్కారానికి అంగీకారం



దీక్షా శిబిరం వద్ద కార్మికులకు హామీ పత్రం అందిస్తున్న ఈఈ నాయక్

రాయగడ: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని సెరిగుడ విద్యుత్ కార్యాలయం ఎదుట గత 5 రోజులుగా నిరసన దీక్ష కొనసాగిస్తున్న విద్యుత్ కర్మచారుల సంఘం సమస్యలను పరిష్కరించేందుకు టాటా పవర్ యాజమాన్యం అంగీకరించింది. ఈ మేరకు దీక్షా శిబిరానికి శుక్రవారం వెళ్లిన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నారాయణ నాయక్ రిలే నిరాహార దీక్షలు చేపట్టిన కార్మికులతో నిమ్మరసం తాగించి దీక్ష విరమించారు. సిబ్బంది న్యాయమైన డిమాండ్లను యాజమాన్యం ఆమోదించిందని, దీనికి గల హామీ పత్రాన్ని ఆయన సంఘం నాయకులకు అందించారు. కార్మికశాఖ నిబంధనలను అనుసరించి ఉద్యోగులను నైపుణ్య, అత్యంత నైపుణ్య కేటగిరీలుగా విభజించడంతో పాటు ఇతర డిమాండ్లను పరిష్కరించాలని కార్మికులు ఆందోళనకు దిగారు. వీటిని నెరవేర్చేందుకు సంస్థ అధికారులు అంగీకరించడంపై వారంతా హర్షం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ శిబిరంలో ఉత్సాహం



కాంగ్రెస్ భవన్‌లో నాయకులు, కార్యకర్తల ఉత్సాహం

భువనేశ్వర్: అఖిల భారత కాంగ్రెస్ కమిటీ(ఏఐసీసీ) మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీపై దాఖలైన పరువు నష్టం దావా కేసు విచారణలో సుప్రీంకోర్టు స్టే మంజూరు చేసింది. దీనిపై స్పందించిన ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్ స్పందించారు. ఇది ప్రజాస్వామ్యం విజయమని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా భువనేశ్వర్ లోని కాంగ్రెస్ భవన్‌లో కార్యకర్తలు ఉత్సాహంతో నినాదాలు చేశారు. బాజాభజంత్రీలు, మిఠాయిల పంపిణీతో సందడిగా గడిపారు. సుప్రీంకోర్టు స్టే మంజూరు చేయడంతో రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వం కొనసాగి, తిరిగి ఎన్నికల్లో పోటీ చేయగలుగుతారని ఆశాభావం వ్యక్తంచేశారు.

ఎమ్మెల్యే మొకీమ్‌కు రూ.10 వేల జరిమానా

తప్పుడు అఫిడవిట్ కేసులో సాక్షుల విచారణకు హాజరు కాకపోవడంతో బరాబటి-కటక్ నియోజకవర్గ ఎమ్మెల్యే మహ్మద్ మొకీమ్‌కు రాష్ట్ర హైకోర్టు శుక్రవారం రూ.10 వేల జరిమానా విధించింది. కోర్టులో హాజరు కావడానికి అదనపు సమయం కోరి, గైర్హాజరు కావడంతో ఈ నిర్ణయం తీసుకోవడం విశేషం. ఆయన చర్య పట్ల అసంతృప్తి వ్యక్తం చేసిన న్యాయస్థానం జరిమానా విధించింది. జరిమానా మొత్తాన్ని సోమవారం లోగా న్యాయవాదుల సంక్షేమ నిధికి జమ చేయాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఆగస్టు 11న తదుపరి విచారణ సందర్భంగా కోర్టుకు హాజరు కావాలన్నారు. ఎన్నికల సందర్భంగా నామినేషన్ పత్రాలను దాఖలు చేసేటప్పుడు తనపై పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులకు సంబంధించి వాస్తవాలను దాచి పెట్టారు. ఇది చట్ట వ్యతిరేకంగా పరిగణించి మొకీమ్ ఎన్నికను సవాల్ చేస్తూ బిజూ జనతాదళ్ నాయకుడు దేబాశిష్ సామంతరాయ్ 2019 జూలై 3న పిటిషన్ దాఖలు చేశారు.

ఆస్తిపాస్తుల వాస్తవాలను సమగ్రంగా వెల్లడించలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ ఆరోపణలు అవాస్తవమని, వీటిని పరిగణలోకి తీసుకోకుండా న్యాయస్థానం తిరస్కరించాలని అభ్యర్థించారు. 2022 జూన్‌లో ఈ కేసు విచారణ చేపట్టిన జస్టిస్ ఎస్‌కే సాహూ 36 అంశాలను పరిగణనలోకి తీసుకుని అభ్యర్థనను తోసిపుచ్చారు.

రాజాంలో విజిలెన్స్ దాడులు

రాజాం సిటీ: రాజాం పట్టణంలో అక్రమంగా విక్రయాలు చేపట్టిన సిగరెట్ ప్యాకెట్ల గొడౌన్‌పై విజిలెన్స్ ఎస్సై బి.రామారావు, లీగల్ మెట్రాలజీ ఎస్సై ఎ.బలరామకృష్ణలు శుక్రవారం దాడిచేసి రూ. 6.17 లక్షలు విలువైన నిషేధిత సిగరెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిషేధిత సిగరెట్లతోపాటు పొగాకు ఉత్పత్తులు జోరుగా విక్రయాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు దాడులు చేపట్టామన్నారు. పట్టణానికి చెందిన మామిడిపాక సాయికృష్ణ వీటిని అక్రమంగా నిల్వ ఉంచడంతోపాటు విక్రయాలు చేపడుతున్నాడని తెలిపారు. స్వాధీనం చేసుకున్న సిగరెట్ ప్యాకెట్‌లను రాజాం పోలీసులకు అప్పగించామని చెప్పారు. ఈ వ్యవహారంపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపడుతున్నామని సీఐ కె.రవికుమార్ తెలిపారు.

విజయనగరంలో..

విజయనగరం క్రైమ్: నిషేధిత పొగాకు ఉత్పత్తుల అక్రమ విక్రయాలకు సంబంధించిన విశ్వసనీయ సమాచారం మేరకు రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు జిల్లా కేంద్రంలో శుక్రవారం పలు చోట్ల దాడులు నిర్వహించారు. వెంకటలక్ష్మి స్వీట్స్, లక్ష్మీ ఎంటర్‌ప్రైజెస్, పీడబ్ల్యూడీ మార్కెట్‌లో తనిఖీలు చేసి రూ.56వేల 840 విలువైన పొగాకు ఉత్పత్తులను కనుగొని, సంబంధిత యజమానిపై కేసు నమోదుచేశారు. అలాగే పట్టణంలోమరోచోట రూ.34వేల 800 విలువైన పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేశారు.

శివ్వాంలో ఏనుగుల గుంపు

వంగర: గజరాజుల గుంపు మళ్లీ వంగర మండలం వైపు వస్తున్నాయి. గురువారం అర్ధరాత్రి నాగావళి నదిని దాటుకుని పార్వతీపురంమన్యం జిల్లా బిటివాడ గ్రామం వైపు వెళ్లిపోవడంతో వంగర మండల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

నరసన్నపేట అసెంబ్లీ పరిశీలకుడిగా వాకాడ నాగేశ్వరరావు

పార్వతీపురంటౌన్: శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడిగా పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన పార్టీ సీనియర్ నాయకుడు, ఉమ్మడి విజయనగరం జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వాకాడ నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసినట్లు పార్వతీపురం ఎమ్మెల్యే జోగారావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకుల సమక్షంలో వాకాడ నాగేశ్వరరావును ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వాకాడ నాగేశ్వరరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు, ప్రజాప్రతినిధులు

వృత్తి పట్ల అంకిత భావంతో పనిచేయాలి

- డీసీహెచ్‌ఎస్ గౌరీశంకర్



పదోన్నతి పొందిన వైద్యులకు రిలీవింగ్ ఆర్డర్స్ ఇస్తున్న డీసీహెచ్‌ఎస్ గౌరీశంకర్

విజయనగరం ఫోర్ట్: వృత్తి పట్ల అంకిత భావంతో పనిచేయాలని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ బి.గౌరీశంకర్ అన్నారు. ఈ మేరకు వైద్య విధాన్ పరిషత్ ఆస్పత్రుల్లో సివిల్ అసిస్టెంట్స్‌గా పనిచేస్తున్న ముగ్గురు వైద్యులకు సివిల్ సర్జన్ స్పెషలిస్టులుగా పదోన్నతితో బదిలీ అయింది. ఈ సందర్భంగా శుక్రవారం వారికి డీసీహెచ్‌ఎస్ కార్యాలయం రిలీవింగ్ ఆర్డర్స్‌ను ఆయన అందజేశారు. నెల్లిమర్లలో జనరల్ సర్జరీ విభాగంలో పనిచేస్తున్న డాక్టర్ డి.వి. శ్రీనివాస్‌కు సీతంపేట ఆస్పత్రికి పదోన్నతితో బదిలీ అయింది. ఎస్. కోట ప్రాంతీయ ఆస్పత్రిలో మత్తు వైద్యురాలిగా పనిచేస్తున్న డాక్టర్ పద్మావతిని రంపచోడవరం, బాడంగి సీహెచ్‌సీలో గైనకాలజిస్టుగా పనిచేస్తున్న సుజనాకుమారికి అమలాపురం ఆస్పత్రికి పదోన్నతిపై బదిలీ అయింది.

రాకోడు పీహెచ్‌సీని సందర్శించిన కేంద్రబృందం

విజయనగరం రూరల్: మండలంలోని రాకోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేంద్రబృందం సభ్యుడు ఆర్తి ఉపాధ్యాయ, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ రవికుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 10న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినాన్ని పురస్కరించుకుని విద్యా సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులు, పిల్లలకు నులి పురుగుల మాత్రలు అందించాలని సూచించారు. నులిపురుగుల నిర్మూలనపై అవగాహన కల్పించాలని చెప్పారు. పీహెచ్‌సీ పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జొన్నవలస గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను పరిశీలించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రాకోడు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.జగదీష్, పీహెచ్‌సీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



పీహెచ్‌సీ అధికారులతో మాట్లాడుతున్న కేంద్ర బృంద సభ్యుడు ఆర్తి ఉపాధ్యాయ

ప్రకృతి పద్ధతిలో ‘సాగు’దాం

- ఇప్పటివరకు వరి మాత్రమే
- ఈఏడాది నుంచి మొక్కజొన్న, కూరగాయలు, ఉద్యాన పంటలు



చీపురుపల్లి మండలంలో పచ్చి రొట్ట ఎరువులను కలియదున్నుతున్న రైతు



జామి మండలం శిరికిపాలెంలో ప్రకృతి సాగు పద్ధతిలో వరి నాట్లు వేస్తున్న మహిళలు

విజయనగరం ఫోర్ట్: సాగులో రసాయనిక ఎరువుల వాడకం పెరిగిపోవడంతో పంటలు విషతుల్యమవుతున్నాయి. వాటి వల్ల జనం వింత రోగాల బారిన పడుతున్నారు. అంతేకాకుండా తక్కువ వయస్సులోనే బీపీ, సుగర్, గుండెజబ్బులతో ఇబ్బంది తప్పడం లేదు. అన్ని పంటలసాగులోను రసాయనిక ఎరువులను అధికంగా వినియోగిస్తున్నారు. దీని వల్ల అనేక అనర్థాలు ఉండడంతో ప్రభుత్వం ప్రకృతిలో సహజ సిద్ధంగా లభించే ఎరువులతో సాగు చేపట్టేవిధంగా చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో ప్రకృతి వ్యవసాయం ప్రతి రైతు చేపట్టేలా చైతన్యవంతం చేయడం జిల్లాలో 34 మందిని ఎంపిక చేశారు. వారికి ప్రకతి వ్యవసాయంపై రైతు-శాస్త్రవేత్త పేరిట శిక్షణ ఇస్తోంది. వీరికి శిక్షణ ఇచ్చి డిప్లమో సర్టిఫికెట్ కూడా ఇవ్వనున్నారు. అంతేకాకుండా వారు నేర్చుకున్న దానిపై పరీక్ష కూడా నిర్వహిస్తారు.

ప్రకృతి సాగులో మొక్కజొన్న, కూరగాయలు

గత ఏడాది వరకు వరి పంటను మాత్రమే ప్రకృతి పద్ధతిలో సాగు చేసేవారు. ఈ ఖరీఫ్ సీజన్ నుంచి మొక్కజొన్న, పత్తి, కూరగాయలు, ఉద్యాన పంటలు కూడా సాగుచేయాలని అధికారులు నిర్ణయించారు.

ఈ ఏడాది ఖరీఫ్ లక్ష్యం 50 వేల ఎకరాలు

ఈ ఏడాది ఖరీఫ్‌లో 50 వేల ఎకరాల్లో ప్రకతిసాగు పద్ధతిలో పంటల సాగు చేపట్టాలని ప్రకతి వ్యవసాయ విభాగం అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో వరి పంట 35 వేల ఎకరాలు. మొక్కజొన్న 4 ఎకరాలు, కూరగాయలు 5 ఎకరాలు, 6 ఎకరాలు ఉద్యాన పంటలు సాగు చేయాలని నిర్ణయించారు. గత ఏడాది సాధారణ పద్ధతిలో వరి పంట దిగుబడి 27 బస్తాలు రాగా, ప్రకతి సాగు పద్ధతిలో 29 బస్తాల దిగుబడి వచ్చింది. గత ఏడాది 26 వేల ఎకరాల్లో ప్రకృతి సాగు పద్ధతిలో వరి పంట సాగు చేశారు. ప్రకృతి సాగు పద్ధతిలో ముందుగా నవధాన్యాలైన మినుము, పెసలు, నువ్వులు, ఉలవలు, రాగి, బొబ్బర్లు, శనగలు, కంది, కట్టిజనుము ఒక్కొక్కటి కేజీ చొప్పున 9 కేజీలు, సుగంధద్రవ్యాలైన మెంతులు, ఆవాలు, ధనియాలు 100 గ్రాములు, కూరగాయలు, ఆకుకూరలైన తోటకూర, గోంగూర, ఆనప, బీర విత్తనాలు 100 గ్రాములు వరి పంట సాగు చేయడానికి 45 రోజుల ముందు పొలంలో చల్లాలి. విత్తనాలు చల్లిన 45 రోజుల తర్వాత పొలంలో కలియదున్ని అప్పుడు వరి పంటను సాగు చేయాలి. అయితే ప్రస్తుతం వర్షాలు అధికంగా కురవడం వల్ల 25 రోజులకే నవధాన్యాలు కలియదున్ని పంటలు సాగు చేసుకోవచ్చు.



రాజాం మండలం గారాజు చీపురుపల్లిలో ప్రకతి సాగు పద్ధతిలో కూరగాయలు



వేపాడ మండలం చామలపల్లిలో జీవామతం తయారు చేస్తున్న మహిళా రైతు

ప్రకృతి సాగు పెరిగేలా చర్యలు

> ప్రకతి వ్యవసాయ పద్ధతిలో రైతులందరూ సాగు చేసేలా చర్యలు చేపడుతున్నాం. ఏటా ప్రకృతి సాగు పెరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. గత ఏడాది 26 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేస్తే ఈఏడాది వరితో పాటు మిగతా పంటలు 50 వేల ఎకరాల్లో సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. - వి.తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి

ఈ విధానం వల్ల ప్రయోజనం :

సుగంధ ద్రవ్యాలు, నవధాన్యాలు, కూరగాయ, ఆకుకూర విత్తనాలు సాగు చేయడం వల్ల భూమిలో సేంద్రియ కర్బనం పెరుగుతుంది. వర్షాభావ పరిస్థితుల్లో కూడా తేమను నిలబెట్టుకుంటుంది. వానపాములు పెరుగుతాయి. వేరు వ్యవస్థ దృఢంగా ఉంటుంది. గింజబరువు పెరుగుతుంది.

సాగు ఖర్చు తగ్గుతుంది

ప్రకృతి విధానంలో సాగు చేయడం వల్ల సాగు ఖర్చు తగ్గుతుంది. 10 టన్నుల పచ్చిరొట్ట ఎరువు వస్తుంది. కాబట్టి పంటలో ఎరువులు వేయాల్సిన అవసరం ఉండదు. దీని వల్ల ఎకరాకి రూ.3 వేల వరకు ఖర్చు తగ్గుతుంది. జీవామృతాన్ని ప్రతి 10 రోజులకు ఎకరాకి 200 లీటర్ల చొప్పున పిచికారీ చేయాలి.

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో ప్రకాశం కలెక్టర్



కలెక్టర్ దినేష్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఈఓ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ప్రకాశం జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ కుటుంబసమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఆలయ విశిష్టతను అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ వివరించారు. ఆదిత్యుని దర్శనం సంతృప్తినిచ్చిందని కలెక్టర్ పేర్కొన్నారు.

కేజీహెచ్‌కు వెళ్లి.. పింఛన్ అందించి..



పింఛన్ అందిస్తున్న వలంటీర్ రజని

నరుబుజ్జిలి: పురుషోత్తపురం గ్రామానికి చెందిన బలగ అప్పలనాయుడు కంటి సంబంధిత సమస్యతో విశాఖపట్నం కేజీహెచ్‌లో ఆపరేషన్ చేయించుకుని చికిత్సపొందుతున్నాడు. ఈ నేపథ్యంలో గ్రామవలంటీర్ కిల్లి రజని శుక్రవారం ఆస్పత్రికి వెళ్లి దివ్యాంగ పింఛన్ అందించి ఆసరాగా నిలిచారు.

కొత్తూరు-టెక్కలి బస్సు సర్వీసుపై హర్షం



టెక్కలి నుంచి కొత్తూరు ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వచ్చిన బస్సు

కొత్తూరు: టెక్కలి నుంచి కొత్తూరుకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే రెడ్డి శాంతికి కృతజ్ఞతలు తెలియజేస్తూ వైఎస్సార్‌సీపీ కొత్తూరు మండలం కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ నేతలు బూర్లె శ్రీనివాసరావు, గండివలస ఆనందరావు, పంకజదాస్, వనుము లక్ష్మీనారాయణ, మతం పూర్ణ, కృష్ణమోహన్, వై.ధర్మారావు తదితరులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. జిల్లాల పునర్విభజన తర్వాత పాతపట్నం నియోజకవర్గం టెక్కలి డివిజన్ పరిధిలోకి వెళ్లడంతో కొత్తూరు నుంచి టెక్కలి వెళ్లేందుకు బస్సు సౌకర్యం లేక ప్రజలు అవస్థలు పడ్డారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే రెడ్డి శాంతి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆమె కలెక్టర్, ఆర్టీసీ అధికారులతో మాట్లాడారు. స్పందించిన అధికారులు ఈ నెల 2 నుంచి టెక్కలి నుంచి కొత్తూరుకు ఆర్టీసీ బస్సు సర్వీస్ ప్రారంభించారు.

సిగరెట్ నిల్వలు పట్టివేత



దుకాణం వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ డీఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్ : ప్రభుత్వ అనుమతులు లేని సిగరెట్ల అక్రమ నిల్వలు చేసినవారిపై చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా ప్రాంతీయ నిఘా, అమలు అధికారి (విజిలెన్సు జేడీ) ఎ.సురేష్‌బాబు హెచ్చరించారు. శుక్రవారం శ్రీకాకుళం, పొందూరు, నరసన్నపేట పట్టణాల్లో పలు వ్యాపార నిల్వలపై జేడీ ఆధ్వర్యంలోని విజిలెన్సు అధికారులు దాడులు నిర్వహించారు. శ్రీకాకుళం పట్టణంలోని పొట్టి శ్రీరాములు మార్కెట్టు వద్ద అమ్మానాన్న కిరాణా జనరల్ స్టోర్, నరసన్నపేటలో తంగుడు గణపతిరావు ఇంటిలో అక్రమంగా నిల్వ ఉన్న రూ. 4,40,529 విలువైన అనుమతులు లేని నాసిరకం సిగరెట్లను స్థానిక పోలీసుల సహకారంతో అధికారులు పట్టుకున్నారు. సంబంధిత వ్యాపారులపై కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో విజిలెన్స్ డీఎస్పీ కిరణ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు అప్పలనాయుడు, సతీష్‌కుమార్, ఎస్‌ఐ అశోక్, ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ బలివాడ గణేష్ పాల్గొన్నారు.

విద్యార్థినుల ఆచూకీ కోసం మూడు బృందాలు

బూర్జ: మండలంలోని కొల్లివలస కస్తూర్బా గాంధీ విద్యాలయంలో బుధవారం రాత్రి ఇద్దరు ఇంటర్మీడియట్ విద్యార్థినులు అదృశ్యమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం సమగ్ర శిక్షా సిబ్బంది కేజీబీవీకి వచ్చి ఆరా తీశారు. స్థానిక పోలీసుస్టేషన్ నుంచి మూడు బృందాలు విశాఖ, విజయవాడ, హైదరాబాద్ వెళ్తున్నట్లు ఎస్సై బి.అశోక్‌బాబు తెలిపారు. సమగ్ర శిక్షా సిబ్బంది జీసీడీఓ ఎస్.నీరజ, ఏఎస్‌ఓ సీహెచ్.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ కె.గాయత్రి, సిబ్బంది పాల్గొన్నారు.

కూలర్లు సిద్ధం.. వ్యాక్సిన్లు భద్రం

- మూగజీవాల మందులపై ప్రత్యేక శ్రద్ధ
- వ్యాక్సిన్లు, మందుల కోసం చల్లటి వాతావరణం
- జిల్లాలోని మూడు డివిజన్లలో వాక్ ఇన్ కూలర్లు
- మండల డిస్పెన్సరీల్లో బల్క్ కూలింగ్ మిషన్లు



మండల ఆస్పత్రుల్లో బల్క్ కూలింగ్ మిషన్

కాశీబుగ్గ: మూగజీవాల ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఇప్పటికే డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్యసేవ పేరిట 1962 అంబులెన్సు సేవలు తీసుకొచ్చిన జగనన్న సర్కారు ఆపదలో ఉన్న పశువులకు అత్యవసర వైద్యం అందిస్తూ రక్షణగా నిలుస్తోంది. తాజాగా మూగజీవాల చికిత్సకు అవసరమైన వ్యాక్సిన్లు భద్రపరిచేందుకు వాక్ ఇన్ కూలర్లు సిద్ధం చేసింది. గతంలో వ్యాక్సిన్లు సరైన భద్రతా ఏర్పాట్లు లేక, బయట వేడి వాతావరణం కారణంగా పాడయ్యేవి. ఇప్పుడా పరిస్థితి లేకుండా కూలర్లు అందుబాటులోకి తీసుకువచ్చారు.

ఎలా పనిచేస్తాయి..

వాక్ ఇన్ కూలర్ ఓ చిన్నపాటి గదిలా ఉంటుంది. ఇందులో సుమారు 15 మంది మనుషులు నిలబడే స్థలం ఉంటుంది. ఇందులో 3 డిగ్రీల నుంచి -7 డిగ్రీల సెంటీగ్రేడ్ చల్లదనం ఉండేలా చర్యలు తీసుకుంటారు. ఏడాది పొడవునా మూగజీవాలకు అవసరమైన వ్యాక్సిన్లు, మందులు ఇక్కడ భద్రపరుస్తున్నారు. బ్యాక్టీరియల్, వైరల్, జబ్బవాపు, గొంతువాపు, చిటుకు వ్యాధి, గాలిగుంటు వ్యాధి, కోళ్లకు అవసరమైన ఆర్‌డీఎఫ్-01, ఆర్‌డీకే, ఎఫ్‌పీ, గొర్రెలకు పీపీఆర్, స్మాల్ ఫాక్స్, నీలి నాలుక వంటి వ్యాధులకు అవసరమైన ఖరీదైన వ్యాక్సిన్లు భద్రపరుస్తున్నారు. ఇక్కడి నుంచి జిల్లా వ్యాప్తంగా ఉన్న డిస్పెన్సరీలలో బల్క్ కూలింగ్ మిషన్ ఏర్పాటు చేసి వాటిలో భద్రపరుస్తున్నారు. ఇక్కడి నుంచి అవసరమైనప్పుడు డిస్పెన్సరీలకు మందులు చేరవేస్తారు.

వాక్ ఇన్ కూలర్లు అంటే..

రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పశువుల ఆస్పత్రులకు వివిధ రకాల వ్యాక్సిన్ సరఫరా చేస్తున్నారు. గత ప్రభుత్వంలో అరకొరగా వీటిని సరఫరా చేసేవారు. అది కూడా సరిపడ చల్లదనం లేకపోవడంతో వేగంగా పాడైపోయేవి. ఈ సమస్యను అధిగమించేందుకు జగనన్న ప్రభుత్వం వ్యాక్సిన్లు నిల్వచేసే కేంద్రాలపై దృష్టి పెట్టింది. జిల్లా వ్యాప్తంగా సరఫరా చేసేందుకు వీలుగా ఏడీడీఎల్ ల్యాబ్‌లో మెగా వాక్‌ఇన్ కూలర్ ఉంది. కొత్తగా పలాస, పాతపట్నం, నరసన్నపేట సబ్ డివిజన్‌లో వాక్ ఇన్ కూలర్లు ఏర్పాటు చేశారు. మండలాల్లోని వెటర్నరీ డిస్పెన్సరీకి బల్క్ కూలింగ్ మిషన్లు సైతం సమకూర్చారు.



జిల్లాకు నూతనంగా వచ్చిన వాక్ ఇన్ కూలర్

ఎప్పుడు కావాలంటే అప్పుడు..



కొన్ని వ్యాక్సిన్లు చల్లదనం లేకపోతే పాడైపోతాయి. మూగజీవాలకు అవసరమైన వ్యాక్సిన్లు, మందులు పాడవకుండా వాక్ ఇన్ కూలర్‌లో భద్రపరుస్తాం. కాలపరిమితి బట్టి ఎన్ని రోజులైనా మందులు సురక్షితంగా ఉంటాయి. వీటికి అనుబంధంగా పశువైద్యశాలల్లో సైతం బల్క్ కూలింగ్ మిషన్‌లు ఏర్పాటు చేశాం.

– డాక్టర్ పోతనపల్లి చంద్రశేఖరరావు, పశుసంవర్ధక సహాయ సంచాలకుడు, పలాస

భూసార పరీక్షలు తప్పనిసరి



కృషి విజ్ఞాన కేంద్రాన్ని పరిశీలిస్తున్న తిరుపాల్ రెడ్డి

ఆమదాలవలస: రైతులు పంటపొలాల్లో ముందస్తుగా భూసార పరీక్షలు నిర్వహించి వాటికి అనుగుణంగా పంటల్లో ఎరువులు వాడితే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చునని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుడు ఐ.తిరుపాల్ రెడ్డి అన్నారు. ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కో ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి కె.వి.కెలో శాస్త్రవేత్తల బృందం నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు. అనంతరం తిరుపాల్ రెడ్డి మాట్లాడుతూ రైతుల సమస్యలను తెలియజేస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. వ్యవసాయ యంత్రాలను రాయితీపై వ్యక్తిగతంగా కొనుగోలు చేయడానికి అవకాశం కల్పించాలని అభ్యుదయ రైతులు విన్నవించారు. కార్యక్రమంలో మిషన్ సభ్యులు గుండు రఘురాం, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ డాక్టర్ సమ నేతాజీ, జిల్లా సంయుక్త వ్యవసాయ అధికారి డాక్టర్ శ్రీధర్, రాగోలు వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ పి.వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలి



పదోన్నతి పొందిన నూతన హెచ్‌ఎంలను సత్కరిస్తున్న పీఎస్‌ఈఏవో, ఒలింపిక్, పీఈటీ సంఘ ప్రతినిధులు, పీడీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: పాఠశాలల్లో మరింతగా క్రీడలను విస్తరించి విద్యార్థులను ఉన్నత క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని టెక్కలి డివిజన్ ఉప విద్యాశాఖాధికారి గార పగడాలమ్మ పిలుపునిచ్చారు. జిల్లా విద్యాశాఖ నేతృత్వంలో జిల్లా పీఈటీ సంఘం, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్పోర్ట్స్ ఆర్గనైజర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జిలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ముందుగా 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ క్రీడా వార్షిక క్యాలెండర్‌పై చర్చించారు. స్కూల్‌గేమ్స్, గ్రిగ్స్‌మీట్‌ల నిర్వహణపై సమీక్షించారు. పీడీ–పీఈటీల జాబ్‌చార్ట్‌లపై మాట్లాడారు. వ్యాయామ ఉపాధ్యాయులకు టీచర్స్ డైరీలను పగడాలమ్మ, తదితరులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఈటీ సంఘ జిల్లా ముఖ్య సలహాదారు పి.సుందరరావు, పీఈటీ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.వి.రమణ, ప్రధాన కార్యదర్శి ఎం.సాంబమూర్తి, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి బి.వి.రమణ, గ్రిగ్స్ సెక్రటరీ కె.మాధవరావు, సంపతిరావు సూరిబాబు, పి.తవిటయ్య, మెట్ట తిరుపతిరావు, శేఖర్‌బాబు, నిర్మల్‌కృష్ణ, జగదీష, సురేష్, రవి, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

హెచ్‌ఎంలకు సత్కారం..

వ్యాయామ ఉపాధ్యాయులుగా రెండు దశాబ్దాలగా సేవలు అందించిన ఎమ్మెస్సీ శేఖర్, వై.పోలినాయుడు, కె.హరిబాబు, ఎం.కూర్మినాయుడు, జి.రాము ఇటీవలి ప్రధానోపాధ్యాయులగా పదోన్నతి పొందారు. వీరిని పీడీ, పీఈటీలు ఘనంగా సత్కరించారు.

వేర్వేరు చోట్ల నదిలో పడి ఇద్దరు మృతి



అర్జున్ (ఫైల్)



పాతపట్నం: ఘటనా స్థలంలో మృతదేహం

పాతపట్నం: జిల్లాలో వేర్వేరు చోట్ల ఇద్దరు నదిలో పడి మృతిచెందారు. పాతపట్నం మండలం కాగువాడ గ్రామానికి చెందిన అర్జున్ పోల్‌లై (52) ఈ నెల 3న స్నానానికి మహేంద్ర నదికి వెళ్లి ప్రమాదవశాత్తు పడిపోయాడు. ప్రవాహం ఎక్కువగా ఉండటంతో కిందికి కొట్టుకుపోయాడు. ఎంత గాలించినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ 4న సీది కమలమ్మ కొట్టు సమీపంలోని బ్రిడ్జికి కూతవేటు దూరంలో మృతదేహం తేలింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం సీహెచ్‌సీ తరలించారు. భార్య ఘష్యాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ మహమ్మద్ యాసీన్ తెలిపారు.

నదిలో జారిపడి వ్యక్తి మృతి



కళింగపట్నం తీరం వద్ద మృతదేహం

గార మండల కేంద్రం గార పంచాయతీ కుమ్మరిపేటకు చెందిన కుమ్మరి అప్పన్న (26) వంశధార నదివద్ద కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి కాలుజారిపడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గార కొత్తబ్రిడ్జి వద్ద కుమ్మరిపేట గ్రామస్తులు ఎక్కువగా స్నానాలు, కాలకృత్యాలు తీర్చుకుంటుంటారు. ఈ క్రమంలో అప్పన్న గురువారం సాయంత్రం మెది వద్దకు వెళ్లగా కాలుజారి పడ్డాడు. కుటుంబ సభ్యులు వెతికినా ఫలితం లేకపోయింది. శుక్రవారం ఉదయం మృతదేహాన్ని కళింగపట్నం గ్రామస్తులు గుర్తించి పోలీసులుకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు వెళ్లి గుర్తించారు. మృతుడి తండ్రి శిమ్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్‌ఐ తెలుగు చంద్రమోహన్ తెలిపారు. అప్పన్నకు భార్య స్వాతి, రెండేళ్ల కుమారుడు ఉన్నారు.



అప్పన్న(ఫైల్)

సాగు యోగం

నారు తీత జోరుగా సాగుతోంది. శుభ ముహూర్తాల్లో ఉభాలు జరుగుతున్నాయి. నీరు నిండిన పొలాల్లో దుక్కులు చక్కగా అవుతున్నాయి. శ్రీకాకుళం సమీపంలోని పొలాల్లో ఖరీఫ్ పనులు ఉత్సాహంగా జరుగుతున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం





● గంపగుత్తగా ముంచేశాడు..

రూ.5కోట్లకు టోపీ.. ఆపై ఐపీ



- ఉద్యోగాలు, చీటీ పాటలు, రియల్ ఎస్టేట్ పేరిట రూ.5కోట్లకు పైగా ఎగనామం
- తెలిసిన వారికే కుచ్చుటోపీ పెట్టిన షేక్ అమిత్
- ఐపీ పెట్టి పారిపోయిన వైనం
- 23 మందికి ఐపీ నోటీసులు జారీ



మోసపోయిన బాధితులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: అతను తరతమ బేధాలు చూడలేదు. స్నేహితులు, బంధువులు అందరినీ మోసం చేశాడు. రైల్వేలో ఉద్యోగాల పేరిట కొందరిని, చీటీ పాటల పేరిట ఇంకొందరిని, రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడుల పేరిట మరికొందరిని నమ్మించి నట్టేట ముంచాడు. ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా రూ.5కోట్లకు పైగా వసూలు చేసి, శ్రీకాకుళం నగరానికి చెందిన షేక్ అమిత్ అనే యువకుడు టోపీ పెట్టేశాడు. సొంత బంధువుల వద్ద కూడా చేబదులంటూ సర్వం దోచేశాడు. అంతటితో ఆగలేదు. మోసం పోలీసుల దృష్టి వరకు వెళ్లిందని 23 మందికి రూ.కోటి 88లక్షలకు ఐపీ నోటీసులు పంపించి పరారయ్యాడు. బాధితుల కథనం ప్రకారం..

శ్రీకాకుళం నగరంలోని గుజరాతీపేట, తోటపాలెం దరి తవిటయ్య చేరికి చెందిన షేక్ అమిత్ చాలా తెలివిగా మోసాలకు పాల్పడ్డాడు. తన అన్న మెడికల్ రిప్రజెంటేటివ్ కావడం, ఆయనకు మరికొందరు రిప్రజెంటేటివ్‌లతో పరిచయాలుండటంతో వారందరినీ గంపగుత్తగా మభ్యపెట్టి మోసాల ఉచ్చులోకి లాగాడు. తొలుత రైల్వేలో జాబులిప్పిస్తానని హామీ ఇవ్వడంతో 16మంది డబ్బులు కట్టారు. ఒక్కొక్కరి నుంచి రూ.5లక్షలు వరకు వసూలు చేశాడు. ఈ లెక్కన రైల్వే ఉద్యోగాల కింద రూ.కోటి వరకు వసూలు చేశాడు. వాళ్లకు ఉద్యోగాలూ ఇవ్వలేదు, తీసుకున్న డబ్బూ వెనక్కి ఇవ్వలేదు. మరికొంతమందికి చీటీ పాటలంటూ మొదట్లో నమ్మకం కలిగేలా నిర్వహించి, భారీ ఎత్తున డబ్బులు వసూలు చేశాక చేతులెత్తేశాడు. ఇంకొందరి నుంచి రణస్థలంలో లేఅవుట్‌లు వేస్తున్నాం.. నేను ఫలానా అతనితో పార్టనర్‌నంటూ.. ఆ ప్రాంతాలకు తీసుకెళ్లి మంచి విందు భోజనం పెట్టించేవాడు. రియల్ ఎస్టేట్‌లో మీరు పెట్టుబడులు పెడితే రెట్టింపు డబ్బు వస్తుందని నమ్మబలికాడు. ఆశ పడిన బాధితులు తమ కష్టార్జితాన్ని, దాచుకున్న సొమ్మును అమిత్ చేతులో పెట్టేశారు. ఇలా అన్ని రకాలుగా రూ.5కోట్లకు పైగా వసూలు చేసి జనాల్ని మోసగించాడు.


బాధితులు వీరే..

శ్రీకాకుళానికి చెందిన ప్రసాదుల రవికుమార్ (పాలిటెక్నిక్ దరి టైల్స్‌షాపు ఓనరు) తన అక్కలిద్దరి పేరిట రూ.18 లక్షలు, కోరాడ రంజిత్‌కుమార్ (శ్రీకాకుళం నగరం) రూ.65 లక్షలు, ఈయన హామీగా 15 మంది రూ. కోటి వరకు అమిత్‌కు ఇచ్చారు. మెండ చంద్రశేఖర్ (పీఎన్ కాలనీ) హామీగా 10 మందికి సంబంధించి రూ.70 లక్షలు, పొట్నూరి రవికుమార్ (ఓల్డ్ నవభారత్ జంక్షన్) హామీగా ఎనిమిది మందికి సంబంధించి రూ.15 లక్షలు, మోసగాడికి వరసకు బావ అవుతున్న షేక్ మదీనా, ఈయన మధ్యవర్తిత్వంతో మరో 12 మందికి సంబంధించి రూ.80 లక్షలు, మహ్మద్ రఫీ (కత్తెరవీధి) రూ.7లక్షలు, రిటైర్డు ఏఎస్‌ఎం లొడ్డి అప్పాయమ్మ రూ.26 లక్షలు, పొట్నూరు వాసు (టూటౌన్ పీస్ దరి) రూ.30 లక్షలు, కర్రి లక్ష్మణరావు (రాజీవ్ గృహకల్ప, వాంబేకాలనీ) హామీగా ఇద్దరి నుంచి రూ.13 లక్షలు, దూబ శ్రీనివాసరావు (తోటపాలెం) నుంచి రూ.14 లక్షలు, కల్లివరపు చంద్రశేఖర్ (బలగ) హామీగా ముగ్గురు వ్యక్తుల నుంచి రూ.15 లక్షలు, మహ్మద్ మున్నా (జిల్లాపరిషత్ దరి), కె.తిరుపతిరావు(నీలమ్మకాలనీ), ఆటో ఈశ్వరరావు (పీఎన్‌కాలనీ), కె.కమల, ఎఎస్‌ఎం (నవభారత్)లు రూ.ఐదేసి లక్షలు చొప్పున ఇచ్చేశారు. వీరిలో ఒకరిద్దరు బ్యాంకింగ్ ద్వారా, ఫోన్ పేద్వారా పంపినా మిగతా వారందరూ ప్రామిసరీ నోట్లు, చెక్కుల ష్యూరిటీ మీద బైహ్యాండ్ నగదు ఇచ్చారు. రైల్వే ఉద్యోగాలని, చీటీ పాటలని, రియల్ ఎస్టేట్ పెట్టుబడి అని, అధిక వడ్డీ అని ఎర చూపి వీరందరి నుంచి వసూలు చేశాడు. డబ్బులు ఇచ్చిన చాన్నాళ్ల తర్వాత తాము మోసపోయామని తెలియడంతో బాధితులంతా రోడ్డెక్కారు. నేరుగా ఎస్పీ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశారు. వీరంతా ఫిర్యాదు చేశారన్న విషయం తెలియగానే మోసాలకు పాల్పడిన అమిత్ మరో ఎత్తుగడకు తెరలేపాడు. నష్టపోయానంటూ 23మందికి రూ.కోటి 89లక్షల మేరకు ఐపీ నోటీసులు పంపించాడు. దీంతో ఆయన్ని నమ్మి డబ్బులు కట్టిన వారంతా అవాక్కై మోసం చేయడమే కాకుండా ఐపీ ముసుగులో బరితెగించేశాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బాధితులు వచ్చారు

షేక్ అమిత్‌కు అప్పులు ఇచ్చామంటూ బాధితులు మా వద్దకు వచ్చిన మాట వాస్తవం. మోసం చేశాడని భావిస్తున్న అతడిని పిలిపించి మాట్లాడు తామని వారికి చెప్పాం. అలా కూడా కుదరకపోతే కోర్టు ద్వారా తేల్చుకోవాలని సూచించాం.

– మప్పల శ్రీనివాసరావు, రెండో పట్టణ పోలీస్ స్టేషన్



అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్రావుకు ఫిర్యాదు చేసిన రిపోర్టు

అదనంగా సొమ్ము ఇస్తానంటూ..



రియల్ ఎస్టేట్ బిజినెస్ చేస్తున్నాను.. దానికి డబ్బులు అవసరం. మీరు రూ.10 లక్షలు ఇస్తే.. మూడు నాలుగు నెలల్లో అధిక వడ్డీతో రూ.5 లక్షలు కలిపి ఇస్తానని మాయమాటలు చెప్పాడు. నేను మా ఇద్దరి అక్కలతో రూ.18 లక్షల వరకు ఇచ్చాను. అసలూ లేదు.. వడ్డీలేదు.. ఐపీ నోటీసు మాత్రం వచ్చింది. నగరంలో రూ.80 లక్షల స్థలం మా డబ్బులతో కొన్నట్లు ఆధారాలున్నాయి.

– ప్రసాదుల రవికుమార్, సాయి ఈశ్వరి టైల్స్ షాపు యజమాని, పాలిటెక్నిక్ కళాశాల దరి


రూ.1.65 లక్షలు ఇచ్చాం..



జాబులిప్పిస్తామని.. సైటుల్లో ఇన్వెస్టు చేస్తామని.. చీటీల పాటని అని చెప్పి నా వద్ద వ్యక్తి గతంగా రూ.65 లక్షలు తీసుకున్నాడు. నా హామీతో 15 మంది రూ. కోటి వరకు ఇచ్చారు. మా డబ్బులతో అతని సోదరుడు పేరున ఉడాలో మూడున్నర సెంట్లు స్థలం కొన్నాడు. అతని పేరుతోనే విశాఖలో మెడికాన్ పేరుతో రూ. కోటి వ్యయంతో సర్జికల్ బిజినెస్ పెట్టాడని తెలిసింది.

– కోరాడ రంజిత్‌కుమార్, శ్రీకాకుళం టౌన్

చీటీల పాట వేస్తానంటూ..



చీటీల పాట వేస్తానంటూ మా వద్ద డబ్బులు వసూలు చేసి సైట్ల కు పెట్టుబడులంటూ రణస్థలం ఏరియాల్లో తిప్పేవాడు. నా వద్ద ఇప్పటివరకు రూ.7 లక్షల వరకు వసూలు చేశాడు. ఎంతో కష్టపడి దాచుకున్న సొమ్ము ఇలా దోచేశాడు. ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు ఇవ్వడంతో తప్పించుకోవడానికి ఐపీ నోటీసులు పంపాడు. – మహ్మద్ రఫీ, కత్తెర వీధి

దగ్గర బంధువే ముంచాడు..



మా సొంత పిన్ని వాళ్ల పాపకు అమిత్‌ను ఇచ్చాం. ఇల్లు కడుతున్నాం.. చేబదులుగా ఇవ్వండంటూ రూ. 80 లక్షల వరకు నొక్కేశాడు. నన్ను నమ్మి 12 మంది డబ్బులు ఇచ్చారు. ఇంటి అల్లుడంటూ మర్యాద ఇస్తే.. ఐపీ నోటీసులు పంపి మమ్మల్ని రోడ్డు మీదకు లాగాడు. – షేక్ మదీనా, పీఎన్ కాలనీ